బ్యాంకుల్లో పైసల్లేవ్

నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

మారిన సగటు మదుపరి పొదుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద కష్టమే వచ్చిపడింది. డిపాజిట్లు లేక ద్రవ్యలభ్యత కరువైపోయింది మరి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన పరిశోధనాత్మక నివేదిక.. భారతీయ బ్యాంకులు ఎదుర్కొంటున్న నగదు కొరత, పడిపోతున్న డిపాజిట్లకు అద్దం పడుతున్నది.

రూ.0.95 లక్షల కోట్లకు పతనం

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

ఇదీ సంగతి..

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కఠిన చర్యలున్నా..

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టర్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!

సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.

ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు.ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

9 లక్షల కోట్లు ఆవిరి

గడిచిన ఆరు రోజుల్లో మదుపరులు కోల్పోయింది..
ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్‌లు రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమొడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.

బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్ ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లలో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఒప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.

ఆర్టీసీకి అద్దె బస్సుల గండం!

- తగ్గుతున్న సొంత బస్సులు, కార్మికులు
- త్వరలో వెయ్యి ప్రైవేట్ ఈవీ బస్సులు
- మహాలక్ష్మి పథకం బస్సులపై చిన్నచూపు
- సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులపైనే ఆసక్తి
- ప్రైవేటీకరణ వైపే ఆర్టీసీ అడుగులు?

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీకి అద్దె బస్సులతో ప్రమాదం పొంచి ఉన్నదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక సొంత బస్సులను కొనుగోలు చేయకుండా అద్దె బస్సులను ప్రవేశపెట్టడం వారి అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. తెలంగాణ ఏర్పడినప్పుడు ఆర్టీసీకి 10,450 బస్సులు, 57,254మంది కార్మికులు ఉండేవారు. ఈ ఏడాది జూన్‌నాటికి బస్సుల సంఖ్య 9,149, సిబ్బంది సంఖ్య 40,415 మందికి పడిపోయింది. గతంలో అద్దె బస్సులు 1,431 మాత్రమే ఉండగా, ఇప్పుడవి 2,750కి పెరగడం ఆందోళనకర పరిణామమని కార్మికులు చెప్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్క్రాప్ బస్సుల స్థానంలో కొత్తవి తెచ్చారు కానీ, అదనపు బస్సులను తేలేదని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం బస్సులైన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రవేశపెట్టకుండా యాజమాన్యం ఈవీ బస్సుల పేరిట ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ సూపర్‌లగ్జరీ బస్సులను ప్రవేశపెడుతున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఎలక్ట్రిక్ బస్సుల పేరిట చేస్తున్న హంగామా చూస్తుంటే, సంస్థకు పొగబెట్టేలా ఉన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీలో దశలవారీగా 2,400 ఈవీ బస్సులు రానున్నాయని, వీటిని అన్ని జిల్లాల్లోనూ ప్రవేశపెట్టనున్నట్టు కరీంనగర్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. అయితే, వాటిని ప్రైవేటు ఆపరేటర్ల ద్వారానే ప్రవేశపెడతారని సమాచారం. జీహెచ్ఎంసీ పరిధిలోనే 800 ఈవీ బస్సులు వస్తున్నాయి. జిల్లాల్లో కూడా 200 బస్సులు తీసుకొస్తున్నారు. ఈవీ బస్సుల కాంట్రాక్టు విధానం బయటకు చెప్పడం లేదని, యాజమాన్యం దృష్టి ప్రైవేటీకరణ వైపే సాగుతున్నదని కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇంకా నెరవేరలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వెయ్యి బస్సులు ఇన్..
4వేల మంది ఔట్

ఆర్టీసీ నిబంధనల మేరకు ఒక బస్సుకు ఆరుగురు కార్మికులు సేవలు అందించాలి. ప్రైవేట్ బస్సులు పెరిగితే క్రమంగా ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని కార్మికులు చెప్తున్నారు. వెయ్యి బస్సులు ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా వస్తున్నాయంటే, రెండు వేల మంది డ్రైవర్లు, వెయ్యి మంది శ్రామిక్‌లు, మరో వెయ్యి మంది హెల్పర్లను ఆర్టీసీ కోల్పోయినట్టేనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎట్టకేలకు ఫార్మసీ ప్రవేశాల షెడ్యూల్

రెండు విడతల్లో సీట్లు భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే ఎప్‌సెట్ బైపీసీ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఎట్టకేలకు నాలుగు నెలలు ఆలస్యంగా కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఫార్మసీ కౌన్సిల్ అనుమతులివ్వడంలో తీవ్ర జాప్యం చేయడంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది. మొత్తం రెండు విడతల్లో సీట్లు భర్తీచేస్తారు. మొదటి విడత షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 19 నుంచి 22లోపు ప్రాసెసింగ్ ఫీజు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుకింగ్, 21 నుంచి 23లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 21 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చు. 28న సీట్ల కేటాయింపు, 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకుని, ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తుది విడత షెడ్యూల్‌లో భాగంగా నవంబర్ 4న ప్రాసెసింగ్ ఫీజు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుక్ చేసుకోవాలి. 5న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 5, 6న వెబ్ ఆప్షన్ల నమోదు, 9న సీట్ల కేటాయింపు ఉంటుంది. 9 నుంచి 11లోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్, ట్యూషన్ ఫీజు చెల్లింపు, 11, 12న రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. 12న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలు విడుదల చేస్తారు.

మధ్యంతర బెయిల్ రద్దు చేయండి

కోర్టులో జానీ మాస్టర్ న్యాయవాది మెమో

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబర్ 7: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. జాతీయ ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డును అందుకునేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉన్నదని జానీ మాస్టర్ విన్నవించడంతో ఇటీవల కోర్టు ఆయనకు 4 రోజుల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. కానీ, అనూహ్యంగా నిర్వాహకులు ఆ అవార్డును రద్దు చేయడంతో జానీ మాస్టర్ ఢిల్లీ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది దాఖలు చేసిన మెమోను కోర్టు అనుమతించింది. కాగా, ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం జానీ మాస్టర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 9కి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి

- 4 నెలల్లోగా ఆ కేటాయింపులను రద్దు చేయాలి
- 17 ఏండ్ల నాటి పిటిషన్‌పై హైకోర్టు కీలక తీర్పు
- ఇందూ టెక్, బ్రాహ్మణి తదితర కంపెనీలకు ఎదురుదెబ్బ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 2001-06 మధ్యకాలంలో ప్రభుత్వం నుంచి భూములను పొంది పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల నుంచి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల నుంచి భూమిని స్వాధీనం చేసుకోలేదన్న పిటిషనర్ వాదన సమర్థనీయమేనని పేర్కొంటూ.. ఇందూటెక్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్, స్టార్గేజ్ ప్రాపర్టీస్, అనంత టెక్నాలజీస్, జెటీ హోల్డింగ్స్ సంస్థలకు జరిపిన భూకేటాయింపులను 4 నెలల్లోగా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి ప్రకటన లేకుండా, వేలం నిర్వహించకుండా నామినేషన్ విధానంలో అమ్మకం, లీజు ప్రాతిపదికపై 4,156 ఎకరాల భూమిని పలు కంపెనీలు, వ్యక్తులకు కేటాయించడాన్ని సవాలు చేస్తూ 2007లో చత్రి సంస్థ పిల్ దాఖలు చేయడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం తీర్పు వెలువరించింది.

22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): పలు శాఖల్లోని ఇంజినీర్ ఉద్యోగాల భర్తీలకు ఈ నెల 22 నుంచి నవంబర్ 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. అసిస్టెంట్ ఇంజినీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన వారికి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి: యూటీఎఫ్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బాకీపడ్డ పెండింగ్ డీఏలు, బిల్లులను తక్షణమే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధులు జంగయ్య, చావరవి, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. కాగా, జీవో-317 బాధితుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి కోరారు.

'జీవో 28 అభ్యర్థులకు న్యాయం చేయాలి'

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ 2008లో జీవో-28తో నష్టపోయిన బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ట్రైబల్ టీచర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఎంబీబీఎస్‌కు గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): నీట్ ఎంబీబీఎస్ అడ్మిషన్లలో 174 మంది సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ విద్యార్థులు సీట్లు కైవసం చేసుకున్నారు. 438 ర్యాంకుతో గాంధీ మెడికల్ కాలేజీలో సాయి వంశీ, 1,791 ర్యాంకుతో హేమంత్, 3,378 ర్యాంకుతో శృతి ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీట్లు దక్కించుకున్నారు. సీట్లు పొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సొసైటీ కార్యదర్శి వర్షిణి అభినందించారు.

కొత్త టీచర్లు 10వేలే..

- అడ్డంకిగా వివాదాలు, కోర్టు కేసులు
- పలు కారణాలతో నిలిచిన కొన్ని పోస్టుల భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 11వేల టీచర్ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసినా ప్రస్తుతం 10వేల మంది టీచర్లకు ప్రభుత్వం కొలువులివ్వనున్నది. మిగతా పోస్టుల భర్తీకి వివాదాలు, కోర్టుకేసులు అడ్డంకిగా నిలిచాయి. పలు కారణాలతో 13 జిల్లాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల పోస్టుల భర్తీకి బ్రేక్‌లు పడ్డాయి. 10 వేల మంది కొత్త టీచర్లకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు ఇవ్వనున్నారు. సోమవారం అర్ధరాత్రి 1:1 జాబితాను జిల్లాలకు పంపించారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగలకుండా అధికారులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే ఇంకా డీఎస్సీకి పలు వివాదాలు వెంటాడుతున్నాయి.

ప్రత్యేక టెట్‌పై కోర్టుకు..

డీఎస్సీ నియామకాలకు ముందు మరో వాదన బయటికొచ్చింది. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించకుండా, రెగ్యులర్ టెట్‌ను నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ కొంత మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. వాస్తవానికి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు 21 రకాల వైకల్యాలున్న వారికి బోధిస్తారు. సబ్జెక్టులు సైతం వేరుగా ఉంటాయి. కానీ వీరికి రెగ్యులర్ టెట్‌ను రాసుకునే అవకాశమిచ్చారు. అప్పట్లో దీనిపై అభ్యర్థులు అభ్యంతరాలు లేవనెత్తారు. కానీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. దీనిపై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 13 జిల్లాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీ నిలిచిపోయింది. మిగతా జిల్లాలతోపాటే తమకు పోస్టింగ్స్ ఇవ్వాలని మరికొందరు అభ్యర్థులు సైఫాబాద్‌లోని డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అభ్యర్థులు అధికారులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

సైబర్ నేరగాళ్లపై 18 ఎల్‌వోసీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 18 మందిపై లుక్ అవుట్ సర్కిల్(ఎల్‌వోసీ)జారీచేశారు. మిగతా నిందితుల వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. వివిధ రాష్ర్టాల్లో సీసీఎస్ సైబర్‌క్రైమ్ బృందాలు అరెస్ట్ చేస్తున్న వారిలో ఎక్కువగా బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు ఖాతాలను సేకరించేవారే ఉంటున్నారు. ఖాతాదారులు, ఖాతాదారుల నుంచి డబ్బు సేకరించి ఏజెంట్లు ఆపై ఉండే వాళ్లకు క్రిప్టో కరెన్సీలో డబ్బు పంపిస్తున్నారు. అది వివిధ కరెన్సీల్లోకి మారి ప్రధాన నిందితులకు చేరుతున్నది. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉంటున్న సైబర్ నేరగాళ్ల పాస్‌పోర్టు వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పాత నేరస్థుల డాటాను సేకరించి ఎక్కడున్నారని తెలుసుకొనే పనిలో ఉన్నారు. గతంలో సైబర్ నేరగాళ్ల కోసం ఎల్‌వోసీ జారీ చేస్తే నేపాల్‌లోని ఖట్మాండ్ మీదుగా రోడ్డుమార్గంలో భారత్‌లోకి ప్రవేశిస్తుండగా, పోలీసులు పట్టుకొని సైబరాబాద్ పోలీసులకు అప్పగించారు.

విషజ్వరంతో చిన్నారి మృతి

వర్షిత(ఫైల్)

ములుగురూరల్, అక్టోబర్ 7: విషజ్వరం బారిన పడి ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా పత్తిపల్లిలో చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన జాటోత్ కవిత-జయపాల్ దంపతులకు కొడుకు హర్షవర్ధన్ 4వ తరగతి, 1వ తరగతి చదువుతున్న కుమార్తె వర్షిత(8) ఉన్నారు. వారం నుంచి వర్షిత విషజ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆదివారం వర్షిత కోమాలోకి వెళ్లడంతో మెరుగైన చికిత్స కోసం హనుమకొండకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని హనుమకొండలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

తాడ్వాయి, అక్టోబర్ 7: ఆర్ఎంపీ అందించిన వైద్యం వికటించి ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరిగింది. జంపంగవాయికి చెందిన రత్నకుమారి (43) ఊరట్టం పోస్టాఫీస్‌లో ఏబీపీగా పనిచేస్తున్నది. 4 రోజుల క్రితం ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో నార్లాపురంలోని ఆర్ఎంపీని సంప్రదించి వైద్యం పొందింది. ఆదివారం మళ్లీ జ్వరంతో అదే ఆర్ఎంపీ దగ్గరికి వెళ్లగా ఇంజెక్షన్లు కలిపిన సెలైన్ ఎక్కించాడు. గంట తర్వాత ఆమె ఆరోగ్యం విషమించడంతో ములుగు దవాఖానకు తీసుకువెళ్లాలని ఆర్ఎంపీ సూచించాడు. ములుగు, అక్కడి నుంచి వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యంలో రత్నకుమారి మృతిచెందింది. ఆర్ఎంపీ రాజ్‌కుమార్ నిర్లక్ష్యంమంతోనే తన తల్లి మృతి చెందిందని ఆమె కుమారుడు భాస్కర్ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశాడు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నకిలీ బ్యాంక్ అధికారుల అరెస్టు

నీలగిరి, అక్టోబర్ 7: తాము బ్యాంకు అధికారులమని చెప్పుకుంటూ.. తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని రైతులను మోసం చేస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేసిన ముఠాలోని ఏడుగురు సభ్యులను అరెస్ట్ చేసినట్టు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. సోమవారం నల్లగొండలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీ లింగోటానికి చెందిన షేక్ వజీర్, వెలుగుగూడేనికి చెందిన కట్టెబోయిన పరమేశ్, వెంకటాద్రిపాలేనికి చెందిన మమ్ముల జ్యోతి స్వరూప్, చిరుమర్తికి చెందిన కొండా శ్రీను, మిర్యాలగూడకు చెందిన గోగుల సురేశ్, జప్తివీరప్పగూడేనికి చెందిన చిలుముల సైదులు, తెప్పలమడుగుకు చెందిన పల్లెబోయిన నాగరాజు, నార్కట్‌పల్లికి చెందిన ముప్పిడి సైదులుతో కలిసి టీమ్‌గా ఏర్పడి 28 మంది నుంచి సుమారు రూ.26 లక్షల వరకు వసూలు చేసినట్టు ఎస్పీ తెలిపారు.